రోడ్డు అధ్వానం.. ప్రయాణం నరకం

- యండమూరు- జి.భావారం రహదారి ఛిద్రం
- ప్రమాదాలకు గురవుతున్న వాహన చోదకులు
- పట్టించుకోని పాలకులు, అధికారులు
- పునర్నిర్మించాలని ప్రజల వినతి


యండమూరు- జి.భావారం మధ్య ధ్వంసమైన రహదారి

కరప: గ్రామాల్లోని రహదారులు ఛిద్రమై అడుగడుగున గుంతలు ఏర్పడ్డాయి. ముఖ్యంగా యండమూరు- జి.భావారం రహదారి ధ్వంసం కావడంతో ప్రజలు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కరప, కాజులూరు మండలాలను అనుసంధానం చేసే రోడ్డు మరీ దారుణంగా తయారైంది. ప్రజలు గగ్గోలు పెడుతున్నా కూటమి పాలకులు, అధికారులు పట్టించుకోవడం లేదని రెండు మండలాల ప్రజలు విమర్శిస్తున్నారు.

నిత్యం ట్రాఫిక్ రద్దీ

మండల పరిధిలోని పెద్దాపురప్పాడు, విజయరాయుడుపాలెం, యండమూరు గ్రామస్తులు మండల కేంద్రానికి రావాలంటే ఈ రోడ్డుపైనే ప్రయాణిస్తుంటారు. వేళంగి, సిరిపురం, జి.భావారం, కూరాడ, చినమామిడాడ, పెదకొత్తూరు, చినకొత్తూరు తదితర గ్రామాల ప్రజలు ద్రాక్షారామ, కోటిపల్లివంటి పుణ్యక్షేత్రాలకు, కాజులూరు మండలం వెళ్లాలంటే జి.భావారం-యండమూరు రోడ్డుపైనే రాకపోకలు సాగిస్తుంటారు. యండమూరు - జి.భావారం రోడ్డు చిన్నాభిన్నమైంది. ఈ రహదారిపై నిత్యం ట్రాఫిక్ రద్దీగా ఉంటుంది. కాజులూరు మండల వాసులు కరప మండలానికి రావాలన్నా ఈ రోడ్డుపైనే రాకపోకలు సాగిస్తుంటారు. యండమూరులోని పురాతనమైన సామ్రాజ్యలక్ష్మి, గోదాదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయానికి రెండు మండలాల ప్రజలు ఈ రహదారి మీదుగానే రాకపోకలు సాగించి, స్వామివారిని దర్శించుకుంటారు.


జి.భావారం- యండమూరు గ్రామాల మధ్య రోడ్డు దుస్థితి


అధ్వానంగా యండమూరు- జి.భావారం రోడ్డు

మరమ్మతులకు గురవుతున్న వాహనాలు

యండమూరు -జి.భావారం రోడ్డును చాలా కాలం క్రితం నిర్మించడంతో రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. గోతులపడ్డ రోడ్డుపై వెళ్లి, వస్తుంటే ద్విచక్ర వాహనాలు, సైకిళ్లు మరమ్మతులకు గురవుతున్నాయని వ్యవసాయ కూలీలు, జాతీయ ఉపాధిహామీ పథకం వేతనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జి.భావారం నుంచి రోడ్డు పొడవునా పెద్ద గోతులు పడ్డాయి. ద్విచక్ర వాహన చోదకులు గోతుల్లో పడి అదుపుతప్పి పడిపోయి, గాయాలపాలవుతున్నారు. రాత్రి సమయంలో గోతులు కనపడక ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని గ్రామస్తులు తెలిపారు. గోతులు పూడ్చేందుకు కూడా చర్యలు తీసుకోవడంలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. వేలకోట్లు ఖర్చుపెట్టి రహదారులు ఆధునీకరించామని గొప్పలు చెప్పుకుంటున్న కూటమి ప్రజాప్రతినిధులకు, నాయకులకు ఈ రహదారి దుస్థితి కనిపించడం లేదా ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి యండమూరు - జి.భావారం రోడ్డును ఆధునీకరించేందుకు చర్యలు తీసుకోవాలని, అంత వరకూ గోతులను పూడ్చించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

తరచూ ప్రమాదాలు



జి.భావారం, యండమూరు రోడ్డు అడుగడుగునా గోతులు పడి ప్రమాదభరితంగా తయారైంది. ఈ రోడ్డుపై ప్రయాణం దినదిన గండంగా ఉంది. సైకిళ్లు, మోటార్‌సైకిళ్లపై వెళ్లేవారు గోతుల్లోపడి అదుపుతప్పి పడిపోయి, గాయాలపాలవుతున్నారు. ఈ రహదారిలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. పాలకులు, అధికారులు స్పందించి రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయించాలి.

– రొక్కాల గణేష్, సర్పంచ్, జి.భావారం

అవస్థలు పడుతున్నాం



రెండు మండలాలను అనుసంధానించే జి.భావారం-యండమూరు రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. వాహన చోదకులు తరచూ ప్రమాదాల పాలవుతున్నారు. అడుగడుగునా గోతులు పడ్డ ఈ రహదారిలో రాకపోకలు సాగించేందుకు వాహన చోదకులు, పాదచారులు నరకయాతన పడుతున్నారు. ఈ రహదారిలో పడిన గోతులను వెంటనే పూడ్చించాలి

– మార్పెళ్ల వెంకటరమణ, యండమూరు

క్లుప్తంగా

భగవద్గీత పారాయణలో గంగాభవాని ప్రతిభ


గణపతి సచ్చిదానందస్వామీజీ నుంచి బంగారు పతకం అందుకుంటున్న గంగాభవాని

కరప: మైసూరులోని అవదూత దత్తపీఠం, గణపతి సచ్చిదానంద ఆశ్రమం ఆధ్వర్యంలో శ్రీమద్భగవద్గీత పారాయణ పోటీలు నిర్వహించారు. అందులో పాల్గొన్న కరప మండలం వాకాడ గ్రామానికి చెందిన దూడ దుర్గా రమేష్ భార్య గంగాభవాని బంగారు పతకం సాధించారు. తెలంగాణ రాష్ట్రం భాగ్యనగర్‌లోని శ్రీదత్త అవదూత క్షేత్రం ఎస్‌జీఎస్ ఆశ్రమంలో ఈనెల 2న సద్గురు గణపతి సచ్చిదానంద స్వామీజీ చేతులమీదుగా కుటుంబ సభ్యులతో కలసి బంగారు పతకాన్ని అందుకున్నట్టు శనివారం వాకాడలో గంగాభవాని తెలిపారు. ఈ సందర్భంగా ఆమెను దూడల నారాయుడు, డాక్టర్ బొండా సూర్యారావు, కరప మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు, పారిశ్రామికవేత్త టి.వీర్రాఘవరెడ్డి, గరగ జెమ్మీ తదితరులు అభినందించారు.

రగ్బీ పోటీలకు జిల్లా జట్టు ఎంపిక


రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు ఎంపికైన జిల్లా క్రీడాకారులు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): జిల్లా రగ్బీ సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి సీనియర్స్ పురుషులు, మహిళల విభాగంలో పోటీల్లో పాల్గొనే జిల్లా జట్టు ఎంపిక కార్యక్రమాన్ని శనివారం కాకినాడలోని జిల్లా క్రీడామైదానంలో నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి బి.శ్రీనివాస్‌కుమార్ ప్రారంభించారు. ఉమ్మడి తూర్పుగోదావరి పరిధిలో నిర్వహించిన ఈ ఎంపిక పోటీల్లో న్యాయ నిర్ణేతలుగా ఎల్.సతీష్, బి.వంశీ, పి.లక్ష్మణరావు వ్యవహరించారు. జిల్లా వ్యాప్తంగా 50 మంది క్రీడాకారులు హాజరయ్యారు. వీరి నుంచి 12 మంది పురుషులు, 8 మంది మహిళలను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఈనెల 13,14 తేదీల్లో అనంతపురం జిల్లాలో నిర్వహించనున్న అంతర్ జిల్లాల రగ్బీ పోటీలో ఈ జట్టు పాల్గొంటాయని రగ్బీ సంఘ అధ్యక్షుడు పాలపర్తి దొరబాబు పేర్కొన్నారు.

అలయన్స్ శరవణ క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక


యాళ్ల రత్నారావు

బాలాజీచెరువు: స్థానిక వెంకట్‌నగర్ శ్రీ నివాసం అపార్ట్‌మెంట్‌లో శనివారం కాకినాడ అలయన్స్ శరవణ క్లబ్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 2025-26 సంవత్సరానికి అలయన్స్ శరవణ క్లబ్ సభ్యులు నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. 2025-26 నూతన అధ్యక్షుడిగా యాళ్ల రత్నారావు, కార్యదర్శిగా డి.రామకృష్ణ, కోశాధికారిగా దామిశెట్టి శ్రీనివాసరావును ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఎన్నికల కమిటీ చైర్మన్ అల్లె దిలీప్‌కుమార్ సదనాని మాట్లాడుతూ 2025-26 నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా క్లబ్ సభ్యులు ఎన్నుకోవడంపై ఆనందం వ్యక్తం చేశారు. నూతన అధ్యక్షుడు యాళ్ల రత్నరావు మాట్లాడుతూ సేవా కార్యక్రమాలకు సభ్యులు పూర్తి మద్దతు అందించాలని కోరారు. త్వరలో శరవణ క్లబ్ కొత్త కార్యవర్గం ప్రమాణస్వీకారం, కొత్త సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఈ ఎన్నిక కార్యక్రమంలో తాయి నగేష్ కుమార్, జె.కృష్ణప్రసాద్, పిల్లి సంజీవ్‌కుమార్, సీహెచ్ వీరవరప్రసాద్, ఎన్.సతీష్, పి.సుబ్బారావు, కృష్ణగోపాల్ లునాని, ఏవీఎస్ నాథ, పి.సంజీవ్‌కుమార్, షబీర్, కె. శ్రీదేవి, ఎస్.వెంకటేశ్వరరావు తదిరులు పాల్గొన్నారు.

ఆంజనేయ రెడ్డికి ఉగాది పురస్కారం


రాజమహేంద్రవరంలో ఉగాది పురస్కారం అందుకుంటున్న అనపాల ఆంజనేయరెడ్డి

కాకినాడ రూరల్: సేవా కార్యక్రమాలతో పేరొందిన కాకినాడకు చెందిన అనపాల ఆంజనేయ రెడ్డి రాజమహేంద్రవరంలో ఇటీవల నిర్వహించిన కార్యక్రమంలో ఉగాది పురస్కారం అందుకున్నారు. పాన్ ఇండియా సోషల్ కల్చరల్ అసోసియేషన్‌కు చెందిన అద్దంకి రాజా ఆధ్వర్యంలో వివిధ రంగాల్లో ప్రతిభచూపిన వారికి ఉగాది పురస్కారాలు అందజేశారు. మంత్రి కందుల దుర్గేష్ చేతుల మీదుగా పురస్కారం అందుకున్నట్టు శనివారం విలేకరులకు తెలియజేశారు. పిఠాపురం - కాకినాడ మార్గంలో రమణయ్యపేటలో చలివేంద్రం ద్వారా తాగునీటి అందించడంతో పాటు అనాథ శవాలకు దహన సంస్కారాలు, వంటి సేవా కార్యక్రమాలు ఆయన నిర్వహిస్తున్నారు. ఆంజనేయ రెడ్డికి పలువురు అభినందనలు తెలియజేశారు.

శ్రీరామ నవమి వేడుకలకు సర్వం సిద్ధం

ఆలయాల్లో భారీ ఏర్పాట్లు


నవమి వేడుకలకు ముస్తాబైన మెయిన్ రోడ్డులోని సీతారామస్వామి ఆలయం

బోట్‌క్లబ్: శ్రీరామనవమి వేడుకలు ఆదివారం వైభవంగా నిర్వహించేందుకు నగరంలో పలు రామాలయాల్లో ఏర్పాట్లు సిద్ధమయ్యాయి. భక్తులు ఆలయాలకు భారీగా తరలివచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో దానికి అనుగుణంగా ఆలయ కమిటీ సభ్యులు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని భక్తులకు మజ్జిగ, మంచినీరు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. స్థానిక మెయిన్‌రోడ్డులోని సీతారామస్వామి ఆలయంలో శనివారం స్వామి, అమ్మవార్లను పెళ్లి కుమారుడుగా, పెళ్లికుమార్తెగా ముస్తాబు చేశారు. ఉదయం స్వామి, అమ్మవార్లకు పంచామృతాభిషేకాలు చేశారు. స్వామివారికి ధనుర్భంగోత్సవం నిర్వహించారు. ఆలయానికి వచ్చే భక్తులకు పానకం, వడపప్పు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. స్థానిక టూ టౌన్ సమీపంలోని సీతారామస్వామి ఆలయంలో నవమి వేడుకలు వైభవంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. స్థానిక బాలాత్రిపుర సుందరి అమ్మవారి ఆలయ సమీపంలోని సీతారామచంద్రమూర్తి ఆలయంలో నవమి వేడుకలు వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. స్వామి, అమ్మవార్లను పెళ్లి కుమారుడు, పెళ్లి కుమార్తెగా ముస్తాబు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ పైండా రామకృష్ణారావు పాల్గొన్నారు. స్థానిక రామారావుపేట శివాలయం ప్రాంగణంలోని కోదండరామస్వామి ఆలయంలో స్వామి వారి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. స్థానిక రిజర్వు లైన్ అయ్యప్పస్వామి ఆలయంలో శ్రీరామనవమి వేడుకలు వైభవంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. వీటితో పాటు నగరంలోని పలు ప్రాంతాల్లో ఉన్న రాముల వారి ఆలయాల్లో వేడుకలు వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి.

హోరు గాలి.. జోరున వాన


కాకినాడ మెయిన్‌రోడ్డులో వర్షపునీరు


కాకినాడ రూరల్ వాకలపూడిలో వర్షం కురుస్తున్న దృశ్యం


సర్పవరం జంక్షన్ వద్ద ట్రాఫిక్‌లో చిక్కుకున్న వాహనాలు

బోట్‌క్లబ్: కాకినాడ నగరంలో శనివారం సాయంత్రం ఈదురు గాలులతో జోరుగా వర్షం కురిసింది. రెండు నెలలుగా విపరీతమైన వేడిగాలులతో ఇబ్బంది పడ్డ ప్రజలకు ఒక్కసారిగా వాతావరణం చల్లబడి చిరు జల్లులు కురవడంతో నగర ప్రజలు సేద తీరారు. సుమారు అరగంట పైనే జోరున వర్షం కురవడంతో నగరంలోని పలు ప్రాంతాల్లో నీరు రోడ్లపైకి చేరింది. స్థానిక వైఎస్సార్ బ్రిడ్జి కింద వర్షపు నీరు నిల్వ ఉండిపోవడంతో ప్రయాణికులు, స్థానికులు చిన్నమార్కెట్‌కు వెళ్లేందుకు అవస్థలు పడాల్సి వచ్చింది. స్థానిక మెయిన్‌రోడ్డుకి ఇరువైపులా వర్షపునీరు నిలిచిపోవడంతో షాపులకు వెళ్లేందుకు వినియోగదారులు ఇబ్బందులు పడ్డారు. చిన్నపాటి వర్షాలకు నగరంలో వర్షపునీరు రోడ్లపై నిలిచిపోవడంతో ప్రజలు బాధలు వర్ణానాతీతం. ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న ప్రజలకు ఈ వర్షపు జల్లులు ఎంతగానో ఊరట నిచ్చింది.

అకాల వర్షం.. వేసవితాపం నుంచి ఉపశమనం

కాకినాడ రూరల్: వేసవి ఎండలు భగ్గుమంటున్నాయి. పగటి ఉష్ణోగ్రతలు క్రమేణా పెరుగుతున్న తరుణంలో శనివారం సాయంత్రం అకాల వర్షంతో కాకినాడ రూరల్ ప్రజలు ఉపశమనం పొందారు. రోజంతా ఎండ తీవ్రతతో ఇబ్బందులు పడిన ప్రజలు సాయంత్రం ఒక్కసారిగా ఎండ తీవ్రత తగ్గి చల్లని గాలులతో పాటు వర్షం కురిసింది. వేసవి తాపంతో అల్లాడుతున్న ప్రజలు వాతావరణం చల్లబడటంతో సేదతీరారు. అకాల వర్షం మామిడి దిగుబడిపై ప్రభావం చూపుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు.

నేలకొరిగిన వృక్షాలు

కాకినాడ క్రైం: కాకినాడ నగరంలో శనివారం సాయంత్రం వీచిన ఈదురుగాలులకు రెండు పెద్ద వృక్షాలు నేలకొరిగాయి. కాకినాడ కచ్చేరిపేటలో ఓ వృక్షం నేల కొరగగా ఆ రహదారిలో రాకపోకలు స్తంభించాయి. జేఎన్‌టీయూకే రోడ్డులోని పాత ఎస్పీ కార్యాలయం ఎదురుగా భారీ వృక్షం నేలకొరిగింది. దీంతో పిఠాపురం నుంచి కాకినాడ వెళ్తున్న వాహనాలు భారీగా నిలిచిపోయాయి. రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సాలిపేట అగ్నిమాపకశాఖాధికారి ఉద్దండ రావు సుబ్బారావు ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు రెండు చెట్లను తొలగించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.

అసలే అంధకారం... ఆపై ట్రాఫిక్ ఇక్కట్లు

కాకినాడ రూరల్: అకాల వర్షం కారణంగా కాకినాడ, పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. దీంతో శనివారం రాత్రి నగరంలో అంధకారం అలుముకుంది. సర్పవరం జంక్షన్‌లో ట్రాఫిక్ సిగ్నల్స్ పనిచేయలేదు. జంక్షన్ వద్ద వాహనాలు ట్రాఫిక్‌లో చిక్కుకున్నాయి. ట్రాఫిక్ కారణంగా వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ట్రాఫిక్ పోలీసులు అధిక సంఖ్యలో చేరుకుని పిఠాపురం - కాకినాడ మధ్య నడిచే వాహనాలు, సర్పవరం - వలసపాకల వైపు రాకపోకలు సాగించే వాహనాలను ఎక్కువ సేపు ట్రాఫిక్‌లో ఉండకుండా నియంత్రణ చర్యలు చేపట్టారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

కరప: ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని వసతులు సమకూర్చి, క్వాలిఫైడ్ ఉపాధ్యాయులతో క్రమశిక్షణతో కూడిన నాణ్యమైన విద్యనందిస్తున్నామని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చదివించాలని ఎంఈఓలు కె.బుల్లికృష్ణవేణి, పి.సత్యనారాయణ కోరారు. యూటీఎఫ్ ఆధ్వర్యంలో మండలంలో శనివారం వేములవాడ, వలసపాకల, యండమూరులో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, యుటీఎఫ్ నాయకులు ప్రత్యేక ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓలు తల్లిదండ్రులతో మాట్లాడారు. పాఠ్యపుస్తకాలు, యూనిఫారం దుస్తులు, బూట్లు, టై, బ్యాగ్ ఉచితంగా అందిస్తున్నట్టు తెలిపారు. పోషక విలువలతో కూడిన మధ్యాహ్న భోజనం చిన్నారులకు వడ్డిస్తున్నట్టు ఎంఈఓలు వివరించి తల్లిదండ్రులను చైతన్యపరచారు. యూటీఎఫ్ ఆధ్వర్యంలో గ్రామాల్లో నిర్వహించిన ర్యాలీలను ఆ సంఘం జిల్లా నాయకుడు ఐ.ప్రసాదరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా వేములవాడ, వలసపాకల, యండమూరులో ప్రైవేటు పాఠశాలలకు వెళ్లే 8 మందిని, అంగన్‌వాడీ కేంద్రాల నుంచి ఐదుగురిని మొత్తం 13 మందికి అడ్మిషన్లు ఇచ్చారు. వేములవాడ సర్పంచ్ కమిడి మంగాదేవి, హెచ్‌ఎంలు పి.రాజబాబు, కె.సుబ్రహ్మణ్యం, యూటీఎఫ్ నాయకులు వీవీ రమణ, అర్జున్, కేవీ రమణ, అలీమ్ పాల్గొన్నారు.


వేములవాడలో సర్పంచ్‌తో కలసి అడ్మిషన్ పత్రాలు అందజేస్తున్న ఎంఈఓలు, యూటీఎఫ్ నాయకులు

ఐ బ్యాంక్‌కు ఉపకరణాల వితరణ

బాలాజీచెరువు: ఉభయ గోదావరి జిల్లాల్లో ఎంతో మంది కార్నియల్ అంధులకు దృష్టిని ప్రసాదిస్తున్న బాదం బాలకృష్ణ ఐ బ్యాంక్‌కు అవసరమైన రూ.1,05,000 విలువైన కార్యాలయ ఫర్నీచర్, కార్నియా స్టోరేజ్, సర్జికల్ సామగ్రిని బెంగుళూరుకు చెందిన మైక్రోటెక్ సంస్థ అందజేసింది. ఈ సందర్భంగా మైక్రోటెక్ సంస్థ సీఈవో బప్పు కమలబాబు మాట్లాడుతూ కార్నియల్ అంధులకు ఆశాదీపంగా ఆవిర్భవించిన ఈ ఐ బ్యాంక్ దినదినాభివృద్ధి చెందాలన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ బాదం బాలకృష్ణ మాట్లాడుతూ ఐ బ్యాంక్‌ల మనుగడకు నేత్రదానంతోపాటు, ఆర్థిక విరాళాలు ఎంతగానో దోహదపడతాయన్నారు. ఇప్పటి వరకు ఐ బ్యాంక్ ద్వారా 7,388 కార్నియాలు సేకరించి, 6,300 మందికి చూపుని ప్రసాదించినట్టు ఆయన తెలిపారు.

పేదల అభ్యున్నతికి జగ్జీవన్‌రామ్ కృషి

- వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న
- ఘనంగా జగ్జీవన్‌రామ్ జయంత్యుత్సవం


వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న పార్టీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న


రమణయ్యపేటలో ఏపీఎస్పీ బెటాలియన్ క్యాంపస్‌లో జగ్జీవన్ రామ్ జయంత్యుత్సవంలో కమాండెంట్ నాగేంద్రరావు, అడిషనల్ కమాండెంట్ దేవానందరావు

బోట్‌క్లబ్: బడుగు, బలహీన వర్గాలు, పేద ప్రజల అభ్యున్నతికి జగ్జీవన్‌రామ్ ఎంతో కృషి చేశారని వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న అన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసిన నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో కొడా మాజీ చైర్మన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, మాజీ కార్పొరేటర్లు కోరుమిల్లి బాలప్రసాద్, పార్టీ నాయకులు రావూరి వేంకటేశ్వరావు, సంగాని నందం, చెక్కా చక్రవర్తి పాల్గొన్నారు.

- స్థానిక ధర్నాచౌక్ సెంటర్‌లో ఉన్న జగ్జీవన్‌రామ్ విగ్రహానికి బీజేపీ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు, పార్టీ నాయకులు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

మహానుభావుల సేవలను స్మరించుకోవాలి

కాకినాడ రూరల్: మహానుభావుల సేవలను స్మరించుకోవడం మనందరి కర్తవ్యమని ఏపీఎస్పీ 3వ బెటాలియన్ కమాండెంట్ ఎం.నాగేంద్రరావు పేర్కొన్నారు. సంఘ సంస్కర్త, గొప్ప రాజకీయ వేత్త, భారత మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రామ్ జయంతిని శనివారం కాకినాడ రూరల్‌లో ఘనంగా నిర్వహించారు. ఏపీఎస్పీ బెటాలియన్‌లో నిర్వహించిన వేడుకలో జగ్జీవన్ రామ్ చిత్రపటానికి కమాండెంట్ నాగేంద్రరావు, అడిషనల్ కమాండెంట్ ఎస్.దేవానందరావు, అసిస్టెంట్ కమాండెంట్లు చంద్రశేఖర్, మోహన్‌రావు, మన్మధరావు తదితరులు నివాళులర్పించారు.

- పండూరులో జగ్జీవన్ రామ్ జయంతిని తాతపూడి దివాకర్, మోర్త అప్పారావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిచారు. ఉప సర్పంచ్ వలవల వెంకటేశ్వరరావు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.
- రమణయ్యపేటలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న గ్రంథాలయ సంస్థ విశ్రాంత ఉద్యోగి చింతపల్లి సుబ్బారావు, అడబాల రత్నప్రసాద్, ప్రసాద్ నాయుడు తదితరులు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

కరప మండలంలో..

కరప: మండల పరిధిలోని పలు గ్రామాల్లో శుక్రవారం జగ్జీవన్‌రామ్ జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో మాజీ ఉపప్రధాని జగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద కార్యాలయం సిబ్బందితో కలసి ఎంపీడీఓ ఎం.అనుపమ నివాళులర్పించారు. స్థానిక పీహెచ్‌సీకి ఎదురుగా ఉన్న జగ్జీవన్‌రామ్ విగ్రహానికి మండల ఎమ్మార్పీఎస్ నాయకులు, వివిధ పార్టీల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

సమాజంలో అన్ని వర్గాలూ సమానత్వం జీవించాలి

బోట్‌క్లబ్: సమాజంలో అన్ని వర్గాలు సమానత్వంతో జీవించాలని అదే మనం జగ్జీవన్‌రామ్‌కు ఇచ్చే నివాళి అని ఇండియన్ డెంటల్ అసోసియేషన్ రాష్ట్ర కన్వీనర్ అడ్డాల సత్యనారాయణ అన్నారు. జగ్జీవనరామ్ జయంతి సందర్భంగా శనివారం స్థానిక కరణంగారి సెంటర్‌లో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి అసోసియేషన్ సభ్యులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

జగ్జీవన్‌రామ్ సేవలు చిరస్మరణీయం

బాలాజీచెరువు: బడుగు బలహీన వర్గాల సమస్యల పరిష్కారానికి అవిరళ కృషి చేసిన మహనీయుడు డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ అని జేఎన్‌టీయూకే ఉపకులపతి సీఎస్ఆర్‌కే ప్రసాద్ అన్నారు. జేఎన్‌టీయూకే ప్రాంగణంలో శనివారం వీసీ కాన్ఫరెన్స్ హాలులో డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. నిమ్న వర్గాల అభ్యున్నతికి విశేషంగా పాటుపడిన జగ్జీవన్ రామ్ సేవలు చిరస్మరణీయమన్నారు. రెక్టార్ కేవీ రమణ, రిజిస్ట్రార్ వి.రవీంద్రనాథ్, ఎస్సీ, ఎస్టీ సెల్ ఆఫీసర్ ఎం.కుమారస్వామి, ఎఫ్‌డీసీ డైరెక్టర్ పి.సుబ్బారావు, ఎస్ఎంఎస్ డైరెక్టర్ ఏ.కృష్ణమోహన్, సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ కె.పద్మరాజు, నాన్ టీచింగ్ స్టాఫ్ అసోసియేషన్ సెక్రటరీ పి.సత్తిబాబు తదితరులు జగ్జీవన్ రామ్ సేవలను కొనియాడారు.


కరప ఎంపీడీఓ కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీడీఓ


జగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపకులపతి సీఎస్ఆర్‌కే ప్రసాద్ తదితరులు

ప్రకటన

నా క్లయింట్, కాకినాడ జిల్లా, కాకినాడ, కాపురస్తులు, శ్రీ నగర్, JMs CNR టవర్స్, flat no. 302 నందు స్థాపించిన M/s. KALPATARU CONSTRUCTIONS, (Registered firm No. 66/2013), తరఫున మేనేజింగ్ పార్టనర్ పాలోజు వెంకట సూర్య నాగ పున్నయ్య వారు ఇచ్చిన సంజాయిషీ ప్రకారం యావన్మందికి తెలియజేయునది ఏమనగా.

సామర్లకోట మండలం, మామిళ్లదొడ్డి గ్రామములోని సర్వే నెం.71/1, 70/1A, 70/1, నందుగల య 4.18 సెంట్ల భూమి "A పార్టీ" 1. నిమ్మల రాఘవ, W/o. వెంకట్రావు (లేటు), 2. నిమ్మల నాగమణి, W/o. భూషయ్య (లేటు), 3.కోలమూరి సత్యవతి, W/o. వెంకటేశ్వరరావు, 4. నిమ్మల వెంకటేశ్వర్రావు, అలియాస్ వెంకటేష్, S/o. వెంకట్రావు (లేటు) 5. నిమ్మల సత్యవతి, W/o.వెంకటేశ్వర్రావు, 6. నిమ్మల రాఘవ, అలియాస్ రాఘవేంద్రిక, D/o వెంకటేశ్వర్రావు 7. కోలమూరి గనిలక్ష్మి, D/o వెంకటేశ్వర్రావు అండ్ "B పార్టీ" 1. నిమ్మల రమణ, W/o. శ్రీనివాస్ (లేటు), 2. నిమ్మల సత్తిబాబు, S/o. గంగరాజు (లేటు), 3. నిమ్మల భూషయ్య, S/o. గంగరాజు (లేటు). 4. నిమ్మల బుచ్చిరాజు, S/o. గంగరాజు (లేటు). 5. అకుల నాగమణి, W/o. రాజారావు. 6. కందుకుర్తి అచ్చియమ్మ, W/o. సత్తిబాబు. వార్లకు చెందిన ఆస్తి అయివున్నది. వారు సదరు ఆస్తిని రెవిన్యూ రికార్డు నందు నమోదు కాబడి, సంపూర్ణ స్వాధీన హక్కు భుక్తములతో అనుభవించుచున్నారు. సదరు ఆస్తిని నా క్లయింట్ కు విక్రయించుటకు అంగీకరించి నా క్లయింట్ పేర ఒక క్రయ అగ్రిమెంట్ వ్రాయించి వున్నారు. సదరు అగ్రిమెంట్ ను పురస్కరించుకొని సదరు భూమిని నా క్లయింట్ క్రయంపొందుచున్నారు. కావున సదరు విషయమై ఎవరికైనను ఏవిధమైన అభ్యంతరములు వున్నచో ఈ ప్రకటన వెలువడిన 7 రోజులలో లిఖిత పూర్వకముగా తెలియపరచవలెను. లేనిచో ఏవిధమైన అభ్యంతరములు లేవని భావించి, నా క్లయింట్ క్రయం పొందుతారని, తదుపరి అభ్యంతరములు నా క్లయింట్ ను బైండ్ చేయవని ఇందుమూలముగా తెలియచేయడమైనది.

మర్ల నరసింహారావు, అడ్వకేట్
డో.నెం.1-9-7, శ్రీరామ్ నగర్,
కాకినాడ - 533 003. సెల్ : 9848277373

